క్లుప్తంగా

సెస్ విధిగా వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో తిప్పే నాయక్

కాకినాడ సిటీ: నిర్మాణ పనులు అమలు చేసే శాఖలు, ప్లాన్ అప్రూవల్ చేసే శాఖలు విధిగా 1 శాతం లేబర్ సెస్ వసూలు చేసి ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు జమ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఆయా శాఖల్లో అమలు చేసే సెస్, పనుల వివరాలను కార్మిక శాఖకు అందజేయాలని ఆదేశించారు. గత ఏడాది సమాచారాన్ని ఉపకార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ వివరించారు. కార్మికశాఖను నిత్యం అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని సంబంధిత సమాచారాన్ని తీసుకుని డేటాబేస్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సంయుక్త కార్మిక కమిషనర్ ఏ.రాణి, ఏలూరు ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌ల పంపిణీ



విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేస్తున్న ఫణికుమార్

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని విఘ్నేశ్వర ఆలయంలో మంగళవారం పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు స్వామి వారి దగ్గర పూజ చేసిన ప్యాడ్‌లు, పెన్నులు అందించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాలు మేరకు నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేసినట్లు ఆలయ ఈవో శివబాబు తెలిపారు. దేవదాయశాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్, డాక్టర్ చంద్రరెడ్డి, వీర్రెడ్డి, కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బెండా విష్ణుమూర్తి, గోవిందు, శ్రీను, మూర్తి, అనిల్ పాల్గొన్నారు.

లయన్స్ ఎలైట్ అధ్యక్షుడిగా సత్యనారాయణ



సత్యనారాయణను అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: లయన్స్ ఎలైట్ క్లబ్ అధ్యక్షుడిగా మైలవరపు సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు క్లబ్ వ్యవస్థాపకులు ముంజులూరి విశ్వేశ్వరరావు ప్రకటించారు. స్థానిక టౌన్‌హాల్‌లో సమావేశ మందిరంలో క్లబ్ ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహించారు. 2024–25 సంవత్సరానికి క్లబ్ కార్యదర్శిగా కె.వరప్రసాద్, కోశాధికారిగా టి.సత్యనారాయణ ఎన్నికయ్యారన్నారు. ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ క్లబ్ గౌరవాన్ని పెంచుతామన్నారు. స్థానిక బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు తన నేత్రాలను దానం చేసేందుకు అంగీకారాన్ని తెలిపారు. కార్యదర్శి వరప్రసాద్ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో విద్య, వైద్య, క్రీడా కార్యక్రమాలతో పాటు పాఠశాలల్లో సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను పుష్పగుచ్ఛాలతో లయన్స్ గవర్నర్ వి.సూర్యనారాయణ, మాజీ గవర్నర్లు బాదం బాలకృష్ణ, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ వైడీ రామారావు అభినందించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

కాకినాడ సిటీ: మంగళవారం జరిగిన ఇంటర్మీడియట్ సంస్కృతం–2, తెలుగు–2, హిందీ–2 మరియు ఒకేషనల్ జీఎఫ్‌సీ జరిగిన పరీక్షల్లో 16,662 మంది విద్యార్థులు హాజరయ్యారు. 17,015 మంది విద్యార్థులకు 16,662 మంది హాజరుకాగా 353 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1253 మందికి 1202 మంది హాజరయ్యారు. 51 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలను డీఐఈవో, ఎస్‌వో, డీఈసీ–1, డీఈసీ–2, డీఈసీ–3, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, రెండు సిటింగ్ స్క్వాడ్‌లు కలిసి 24 కాలేజీలను తనిఖీ చేశారు. పరీక్షలు అన్ని చోట్లా ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు.

హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం



డ్రైవింగ్ శిక్షణ ప్రారంభించిన ఆర్టీసీ అధికారులు

కాకినాడ సిటీ: ఏపీఎస్ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ శిక్షణ తరగతులు 16వ బ్యాచ్ మంగళవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ శ్రీనివాస్, ఎంవీఐ హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లతో స్థలాలపై సంపూర్ణహక్కు

- ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కురసాల
- లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ



రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి అప్పగించడం వల్ల సదరు ఇంటి స్థలంపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కు లభిస్తుందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఇళ్ల స్థల లబ్ధిదారులకు మంగళవారం కాకినాడ అంబేడ్కర్ గ్లోబ్ సెంటర్, సంజయ్‌నగర్ సచివాలయం, ఏటిమొగ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే ద్వారంపూడి పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, కార్యదర్శి ఎం.ఏసుబాబు, మాజీ మేయర్, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ పేదల సొంతింటికలను సాకారం చేయడంతోపాటు ఇచ్చిన స్థలాలపై పూర్తి హక్కు కల్పించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు.

మోసపూరిత వాగ్దానాలను నమ్మొద్దు

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ, జనసేన వంటి పార్టీలు మోసపూరిత వాగ్దానాలతో వస్తున్నాయని, వీరి మాయమాటలు నమ్మొదని ఎమ్మెల్యే ద్వారంపూడి కోరారు. ప్రజలను నట్టేట ముంచేందుకు ఆ రెండు పార్టీలు పొత్తులతో ఎన్నికలకు సిద్ధమయ్యాయన్నారు. మంచి జరిగిందని భావిస్తేనే ఓటు వేయమని సీఎం కోరుతున్నారని, ప్రజలు కూడా వాస్తవాలను గుర్తించి వైఎస్సార్ సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. పట్టాలు ఇచ్చిన 30 వేల ఇళ్లను పూర్తి చేసి 2025 డిసెంబర్ నాటికి అప్పగించాలన్నది తన ఆకాంక్ష అని, ప్రజలు క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ పండుగలను కొత్త ఇళ్లలో చేసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు మాట్లాడుతూ 7,8,13, డివిజన్లకు సంబంధించి 2,058 మందికి, 10, 11 డివిజన్లకు సంబంధించి 2960 మందికి, 14, 15, 16, 17, 19 డివిజన్లకు సంబంధించి 3,028 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్నామన్నారు. సమావేశంలో లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు, పార్టీ నాయకులు తొంపల తాతారావు, సిగల మధు, బత్తిన రాజు, నందకుమార్, చిట్నీడి మూర్తి, అస్గర్, సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, డివిజన్ ప్రత్యేకాధికారి ఎంపీ రామశాస్త్రి, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు విలువైన ఆస్తి : ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఇళ్ల పట్టాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పంపిణీ చేశారని, మహిళల పేరిట విలువైన ఆస్తిగా సంపూర్ణ హక్కుతో రిజిస్ట్రేషన్ చేసి వాటిని అందిస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని సర్పవరం గ్రామంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలను రిజిస్టర్ చేసి ఆటోనగర్‌లోని డీజీబీ ఫంక్షన్ హాలు వద్ద మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబం సొంతింటి కోసం కలగంటారని, వారి కల నెరవేర్చేందుకు ఎన్నికల ముందు 25 లక్షలు ఇళ్ల పట్టాలు అందిస్తామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక సీఎంగా ఇచ్చిన హామీ కంటే అధికంగా సుమారు 32 లక్షలు మందికి పట్టాలు పంపిణీ చేశారన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు సీఎం జగన్ దృష్టికి ఇక్కడి సమస్య తీసుకువెళ్లడంతో నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో విలువైన స్థలాలను పండూరు, నేమాం, నడకుదురు, తదితర చోట్ల మార్కెట్ రేటుకే కొనుగోలు చేశామన్నారు. నియోజకవర్గంలో 32 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం, సొంతింటి కల నెరవేర్చడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, నాయకులు పుల్ల చందు, కోటేశ్వరరావు, చక్రధర్, కొప్పిశెట్టి శివ, డేవిడ్ లివింగ్ స్టన్, పూసల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



రమణయ్యపేట ఆంజనేయనగర్ కాలనీలో అభివృద్ధి చేసిన పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గ్రామంలో ఆంజనేయనగర్, బాపన్నదొర కాలనీలలో రూ.25 లక్షలతో అభివృద్ధి చేసిన పార్కులు, రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ సీఎం జగన్ నాయకత్వంలో అభివృద్ధి పనులు భారీగా చేపట్టామన్నారు. రమణయ్యపేటలో ఎక్కువ జనాభా నివసిస్తున్నారని, ఆంజనేయ నగర్, బాపన్న దొర నగర్ కాలనీవాసుల కోరిక మేరకు పార్కులు అభివృద్ధి చేశామన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ రేఖారెడ్డి, పెనుమళ్ల ధర్మారావు, రామిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గగారిన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, కాపు కార్పొరేషన్ డైరెక్టరు లింగం రవి, కొత్తపల్లి గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును అర్చనకు అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



లబ్ధిదారులకు సీఎం సాయం చెక్కులు అందజేస్తున్న కురసాల సత్యనారాయణ తదితరులు

కాకినాడ: ఓ పేద కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ రూ.3 లక్షల చెక్కును ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మంగళవారం మృతుని భార్య అర్చనకు అందజేశారు. ఆమె భర్త విద్యుత్‌షాక్‌కు గురై మరణించడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితిని సీఎం దృష్టికి తీసుకువెళ్లి ఈ సొమ్ము మంజూరు చేయించినట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మండల కన్వీనర్ రొక్కాల సత్యనారాయణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాషా, వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: నియోజకవర్గంలోని 12మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.23.35 లక్షల చెక్కులను నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పంపిణీ చేశారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబు సిఫారసుతో నియోజకవర్గంలో అత్యధిక మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించామన్నారు. కార్యక్రమంలో తిమ్మాపురం సర్పంచ్, జీఎస్‌టీయూకే వీసీ మెంబరు బెజవాడ సత్యనారాయణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, కోమలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్యాన్సర్ అంతం

- నిపుణుల విలువైన సూచనలు, సలహాలు
- కాకినాడ జీజీహెచ్‌లో అవగాహనా సదస్సు



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దేవీ మాధవి



సదస్సుకు హాజరైన నర్సులు, నర్సింగ్ విద్యార్థులు, సిబ్బంది

కాకినాడ క్రైం: మహిళల్లో క్యాన్సర్ నివారణే లక్ష్యంగా మంగళవారం జీజీహెచ్‌లోని ఎస్‌పీఎం లెక్చర్ గ్యాలరీలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఆధ్వర్యంలో రేడియేషన్ ఆంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ వాసన్ అధ్యక్షతన, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ దేవీ మాధవి, సర్జికల్ ఆంకాలజీ హెచ్‌వోడీ సమంత్ వక్తలుగా క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు.

గుండె జబ్బులంత వేగంగా క్యాన్సర్

అభివృద్ధి చెందుతున్న దేశాలలో క్యాన్సర్లు వేగంగా విస్తరిస్తున్నాయని డాక్టర్ దేవీ మాధవి వెల్లడించారు. కుటుంబ నేపథ్యం, తీవ్ర ఒత్తిళ్లు, దురలవాట్లకు బానిసలు కావడం వంటివి ఇందుకు కారణాలవుతున్నాయని అన్నారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్


శృంగార జీవితానికి ముందే లింగ భేదం లేకుండా హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ వేయించాలని నిపుణులు సూచించారు. దీని వల్ల స్త్రీలలో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ తలెత్తే ప్రమాదం ఉందని అన్నారు.

తడుముకుంటే తెలుస్తుంది...

క్యాన్సర్ బయటపడడానికి ముందే దానిని పసిగట్టవచ్చని రేడియేషన్ ఆంకాలజిస్టు డాక్టర్ రామ్మోహన్‌రావు, గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్తి, పాథాలజీ ఎస్ఆర్ డాక్టర్ దీప్తి తెలిపారు. ప్రతి స్త్రీ స్వయంగా నిపుణుల సూచన మేరకు తన ఛాతిని తడుముకుంటూ లోపల గడ్డలు ఉన్నా, అవి పెరుగుతున్నట్లు గమనించినా, నొప్పి పుడుతున్నా గుర్తించి నిపుణులను సంప్రదించవచ్చు. స్త్రీలకు గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్, రొమ్ము (బ్రెస్ట్) క్యాన్సర్లే మరణశాసనాలని వైద్యులు వెల్లడించారు.

సదస్సులో ఆంకాలజీ నిపుణుడు డాక్టర్ కె.ప్రదీప్ సహా, కమ్యూనిటీ మెడిసిన్, అనస్థీషియా, గైనికాలజీ నిపుణులు పాల్గొన్నారు. వీరితో పాటు ఆసుపత్రి నర్సులు, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.


మహిళా దినోత్సవానికి సార్థకత



ప్రభుత్వం ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం ద్వారా మహిళా దినోత్సవం సార్థకతను సంతరించుకుంది. అటువంటి వారి సమస్యలకు తాజా స్క్రీనింగ్ పరీక్షలు, అవగాహన సదస్సుతో సమాధానం దొరికింది. కాకినాడ జీజీహెచ్, ఆర్ఎంసీలకు ఈ అవకాశం అందేలా కృషి చేసిన రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు డాక్టర్ నరసింహంకు ధన్యవాదాలు.

– డాక్టర్ ఎంపీఆర్ విఠల్, సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ


తొలి దశలో గుర్తిస్తే ప్రాణాపాయం దూరం



క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే ప్రాణాపాయం ఉండదు. ఇందుకు స్క్రీనింగ్ పరీక్షలు ఎంతో తోడ్పడతాయి. జీజీహెచ్‌లో నవ్య రాకతో క్యాన్సర్ సేవలు మరింత బలోపేతం అయ్యాయి. ఇందులో డీఎంఈ డాక్టర్ నరసింహం కృషి మరువలేనిది.

– డాక్టర్ శ్రీనివాసన్, హెచ్‌వోడీ, రేడియేషన్ ఆంకాలజీ, ఆర్ఎంసీ, కాకినాడ

మనమే ఇలా అయితే ఎలా?



క్యాన్సర్ వార్డులో పనిచేస్తూ ప్రాణాలు నిలవడం కోసం కొట్టుకుంటున్న ఎన్నో దుర్భర జీవితాల దుస్థితిని నిత్యం కళ్లారా చూస్తున్నాం. ఆసుపత్రి సిబ్బంది అయినా మనలో ఎందరో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ స్క్రీనింగ్‌కు ముందుకు రావడం లేదు. ఈ నెల 7వ తేదీ వరకే ఈ అవకాశం ఉంది. జీజీహెచ్, ఆర్ఎంసీలకు చెందిన ప్రతి ఒక్క మహిళా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మనం సేవలందించే రోగులకు ఆదర్శంగా నిలవాలి.

– పులిదిండి సుధా, స్టాఫ్ నర్సు, క్యాన్సర్ వార్డు, జీజీహెచ్

శుభంకరుడు.. శంకరుడు

పిఠాపురం / సామర్లకోట: హరోం హరా.. శుభంకరా.. అంటూ శైవ క్షేత్రాలు మార్మోగనున్నాయి. పిఠాపురంలోని పాదగయ, సామర్లకోటలోని పంచారామ క్షేత్రాల్లో బుధవారం నుంచి శివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరుగనుంది. పిఠాపురం పాదగయ క్షేత్రానికి చారిత్రక ప్రాధాన్యం ఉంది. మహా శివరాత్రి పర్వదినాల్లో ఈ క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని వారం రోజుల పాటు నిత్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లక్షపత్రి పూజలు, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఈ నెల 6వ తేదీ బుధవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నమస్కార రీతులలో పాద నమస్కారం శ్రేష్ఠమైనట్లు త్రిగయా క్షేత్రాల్లో పాదగయ క్షేత్రం శ్రేష్ఠమైందని చెబుతుంటారు. అందుకే గోదావరి పుష్కర కాలంలో ఎక్కువగా ఒడిశా రాష్ట్రం నుంచి ఒడ్రులు కనీసం ఇంటికి ఒకరైనా వచ్చి రాజమహేంద్రవరం గోదావరిలో స్నానం చేసి ఈ పాదగయ క్షేత్రంలో పిండ ప్రదానం చేయడం తరతరాలుగా వస్తోంది. ఇది పితృ దేవతలకు ముక్తి కలిగించే క్షేత్రంగా పేరొందింది.



పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామివారి నిజరూపం

దర్శనీయ ఆలయాలివే..

పాదగయ క్షేత్రం పలు ఆలయాల సమూహం. ఇక్కడ అనేక దేవతామూర్తుల ఆలయాలు దర్శనమిస్తాయి. తొలి పూజ అందుకునే గణపతి, విశేష అభిషేకాలు అందుకునే కాశీ విశ్వేశ్వరుడు, కాశీ అన్నపూర్ణాదేవి, చండీశ్వరస్వామి, గయాసురిని పాదాలు, నాగేంద్ర స్వామి, దత్తాత్రేయ స్వామి, సాయిబాబా, కనకదుర్గాదేవి, నవగ్రహ దేవతలు, సరస్వతీదేవి, ఆదిశంకరాచార్యుడు, అయ్యప్ప స్వామి తదితర ఆలయాలు ఇక్కడ ఉన్నాయి. కుక్కుటేశ్వరుని గర్భాలయం చుట్టూ ఈ ఆలయాన్ని నిర్మించారు. స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసే సమయంలో వీరందరిని దర్శించుకునే అవకాశం ఉంది.

పాదగయ క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామివారి దివ్య కల్యాణం బుధవారం రాత్రి 8.32 గంటలకు నిర్వహించనుండగా, ఏడో తేదీ గురువారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేస్తారు. 8న మహాశివరాత్రి ఉత్సవం, 9న మధ్యాహ్నం మూడు గంటలకు నాకబలి, దండాడింపు, దొంగలదోపు ఉత్సవాలు, స్వామివారి రథోత్సవం, 10న స్వామివారి త్రిశూల స్నానం నిర్వహించనున్నారు. 11న స్వామివారి తెప్పోత్సవం, శ్రీపుష్పోత్సవం ఉంటుంది. అలాగే పిఠాపురం సకలేశ్వర స్వామి, సోమేశ్వరస్వామి ఆలయాలు, గొల్లప్రోలు మండలం దుర్గాడలోని ఉమారామలింగేశ్వరస్వామి, గొల్లప్రోలులో ఉమారామలింగేశ్వర స్వామి, చేబ్రోలులో పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి, తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామివారి ఆలయాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు.

నేడు భీమేశ్వరస్వామి కల్యాణం

సామర్లకోటలోని బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి కల్యాణం బుధవారం రాత్రి 9.25 గంటలకు నిర్వహించనున్నారు. మహా శివరాత్రికి రెండు రోజుల ముందుగా వచ్చే ఫాల్గుణ మాస ఏకాదశి పర్వదినంలో స్వామివారి కల్యాణం జరుగుతుంది. ఈ కల్యాణాన్ని పురస్కరించుకుని ఉదయం విఘ్నేశ్వర పూజ, దీక్షాధారణ ఉంటుంది. మధ్యాహ్నం స్వామివారి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పూలు, విద్యుత్తు దీపాలతో అలంకరించిన ఇత్తడి నంది వాహనంపై ఉంచి ఆలయం నుంచి పట్టణ పుర వీధుల మీదుగా ఊరేగిస్తారు. అనంతరం ఆలయానికి వచ్చిన ఉత్సవమూర్తులకు ధ్వజారోహణ చేస్తారు. వేద మంత్రాలతో పల్లకిపై స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక వద్దకు తీసుకు వస్తారు. అక్కడ అన్నవరం వేదపండితులతో పాటు ఆలయ పండితులు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. స్వామి వారి కల్యాణాన్ని పురస్కరించుకుని నృత్యాంజలి కళానిలయం బాల బాలికలచే కూచిపూడి నాట్యం ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ. భళ్ల నీలకంఠం తెలిపారు.

కొత్తపల్లి: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రాజశేఖరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శర్మ, సుబ్రహ్మణ్యం తెలిపారు. గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు కల్యాణం ఉంటుందన్నారు. గురువారం స్వామివారికి లలితా పారాయణ, ఆలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం మహా శివరాత్రి, మాస శివరాత్రి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పంచామృత అభిషేకాలు జరుగుతాయన్నారు. 10న రథోత్సవం, తీర్థం, కోలాటం, 11న శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

జగన్ పాలనలోనే బీసీలకు అగ్రస్థానం

రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి విష్ణు



ఇరుసుమళ్ల విష్ణు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే వెనుకబడిన కులాలకు సముచిత ప్రాధాన్యం దక్కిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి ఇరుసుమళ్ల విష్ణు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో బీసీలను దగా చేశారంటూ టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు చేసిన విమర్శలపై విష్ణు మంగళవారం విలేకర్ల వద్ద ఖండించారు. చంద్రబాబు హయాంలో బీసీలను అన్ని విధాలా అణగదొక్కారని విమర్శించారు. జగన్ సీఎం అయ్యాక లోక్‌సభ, రాజ్యసభకు బీసీలను పంపారని, బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి గుర్తింపునిచ్చారన్నారు. బీసీల పార్టీగా చెప్పుకుంటూ ఏనాడైనా బీసీలను ఉన్నత స్థానంలో కూర్చోబెట్టిన చరిత్ర టీడీపీకి ఉందా? అని ఆయన నిలదీశారు. రాజకీయ లబ్ధికోసమే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి

సామర్లకోట: పదో తరగతి పరీక్షలు రాయడంలో లక్ష్యం నిర్ణయించుకోవాలని పిఠాపురం చైల్డు స్పెషలిస్టు డాక్టరు పీఎస్ రాజు అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక బ్రౌన్‌పేటలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు రాసే విధానంపై అవగాహన కల్పించారు. పాఠ్యాంశాలు ఎలా చదవాలి, ఎంత సమయం చదవాలి లక్ష్యాలు ఏలా నిర్ణయించుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో ఆరోగ్య పరంగా తీసుకొవలసిన జాగ్రత్తలను ఆయన సూచించారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ ప్రిన్సిపాల్ యు.మీనామాధురి అధ్యక్షత వహించగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయవాడకు తరలివెళ్లిన హమాలీలు

సామర్లకోట: చలో విజయవాడ కార్యక్రమానికి సామర్లకోట నుంచి ఐఎంఎఫ్ఎల్ డిపోల్లో పని చేస్తున్న హమాలీలు తరలివెళ్లారు. మంగళవారం సామర్లకోట, అమలాపురం డిపోలకు చెందిన హమాలీలు రైలులో విజయవాడకు వెళ్లారు. ఎగుమతి, దిగుమతి కూలీ రేట్లు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలనే డిమాండ్ల సాధన కోసం ఏబీ బేవరేజ్ కార్పొరేషన్‌కు వెళ్తున్నట్లు హమాలీస్ సంఘ నాయకులు తెలిపారు. సంఘ నాయకులు బి.ఆదినారాయణ, వి.గోవిందు, యు.సతీష్, కె.దుర్గాప్రసాద్, ఎం.వీరబాబు, బి.రామారావు పాల్గొన్నారు.

గోరుముద్దను సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందజేస్తున్నామని, దీనిని ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. మంగళవారం స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో అమలు జరుగుతున్న గోరుముద్ద పథకాన్ని ఆయన పరిశీలించి రుచి చూశారు. పాఠశాలలో 95 శాతం మంది విద్యార్థులు భోజనాలు చేస్తున్నట్లు హెచ్ఎం యు.సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కెనడీ, టీఎస్ పద్మావతి, ఎస్.శ్రీదేవి, బీవీ తేజోలత పాల్గొన్నారు.

వివాహితను రక్షించిన రైల్వే పోలీసులు

సామర్లకోట: ఆత్మహత్యాయత్నం చేసిన ఒక వివాహితను మంగళవారం రైల్వే పోలీసులు రక్షించారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం వీకే రాయపురం గ్రామానికి చెందిన మలిరెడ్డి నాగమహాలక్ష్మి భర్త శివదుర్గ చెప్పినా వినకుండా అప్పులు చేయడంతో జీవితంపై విరక్తి చెందిన సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ఆత్మహత్య చేసుకోవడానికి చిన్న కుమార్తెను తీసుకువచ్చినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే స్టేషన్‌లో పల్స్‌పోలియో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తమై రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఘటన ప్రదేశానికి చేరుకుని నాగమహాలక్ష్మి రక్షించారు. విషయం తెలుసుకుని భర్త శివదుర్గకు సమాచారం ఇచ్చి ఇరువురికి ఎస్సై బి.లోవరాజు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ చేశారు.

వ్యక్తి అదృశ్యం

సామర్లకోట: మండల పరిధిలో చంద్రంపాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మందులు తెచ్చుకొవడానికి వెళ్లి అదృశ్యమైన ఘటనపై పోలీసు స్టేషన్‌లో నమోదు అయింది. పోలీసుల కథనం ప్రకారం చంద్రంపాలెం గ్రామానికి చెందిన జక్కి వేణుగోపాల్ (46) సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటి నుంచి ఆటోలో మందులు తెచ్చుకొవడానికి వెళ్లి ఇంటికి రాలేదు. దాంతో బంధువులు గాలించగా ఆటో గొంచాల శివారున స్కూల్ వద్ద ఉన్నట్లు గమనించారు. అయితే వేణుగోపాల్ కనిపించలేదు. దాంతో మంగళవారం తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.